కాఫీ నగదు చెల్లింపులో జాప్యం

ప్రజాశక్తి - చింతపల్లి: గిరి రైతులు నిర్మించుకున్న కాఫీ కల్లాలకు కాఫీ బోర్డు నగదు జమ చేయడంలో జాప్యం ఎందుకు చేస్తుందని సిపిఐ ఎర్ర బొమ్మల ఎంపీటీసీ సభ్యుడు సెగ్గే సత్తిబాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ, గిరి రైతులను ఆర్థికంగా ఆదుకునే క్రమంలో భాగంగా కాఫీ రైతులకు సంబంధించి కాఫీ కల్లాలు (400 అడుగుల) నిర్మించుకున్న రైతులకు 22,500 రూపాయలు చెల్లిస్తామన్న కాఫీ బోర్డ్ యాజమాన్యం ఇదే క్రమంలో గత ఏడాది ఒక్కొక్క రైతుకు 225 చొప్పున కాఫ మొక్కలు సరఫరా చేసిన కాఫీ బోర్డు అందుకు సంబంధించిన నగదును కూడా రైతులకు జమ చేయలేదన్నారు. గిరి రైతులు శ్రమకోర్చి సేకరించిన కాఫీ పండ్లకు గిట్టుబాటు ధర చెల్లించకుండా రైతు నిర్ణయించిన ధర కాకుండా కాఫీ బోర్డే కిలో 43 రూపాయలగా నిర్ణయించి కొనుగోలు చేయడం భావ్యం కాదన్నారు. అదేవిధంగా గిరి రైతులు శ్రమటోర్చి సేకరించిన కాఫీ పండ్లకు గిట్టుబాటు ధర చెల్లించకుండా రైతు నిర్ణయించిన ధర కాకుండా కాఫీ బోర్డే కిలో 43 రూపాయలగా నిర్ణయించి కొనుగోలు చేయడం భావ్యం కాదన్నారు.

గిరిజన విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి.శంకర్రావు

ప్రజాశక్తి-అరకులోయ: గిరిజన విద్యార్థులు జాతీయ క్రీడా స్థాయికి ఎదగాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు అన్నారు. అరకులోయలోని కంఠభౌన్సగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో అండర్ 14 విభాగం వాలీబాల్ క్రీడలు ను ఆయన గురువారం సందర్శించారు.ముందుగా ఆ పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలతో టీం స్పిరిట్ పెరుగుతుందని చెప్పారు. క్రీడలతో మంచి క్రమశిక్షణ అలవడుతుందని స్పష్టం చేశారు. విభిన్న వాతావరణ పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ఆయన అభినం దించారు. ట్రైబల్, కాఫీ మ్యూజియంలను సందర్శించారు. కొత్త బల్లుగుడ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఎనిమిదో తరగతి గదిని సందర్శించి విద్యార్థులకు ఆంగ్ల పాఠ్యాంశాలను బోధించారు. బాలికలకు హక్కులపై అవగాహన ఉండాలన్నారు. కొత్తబల్లుగుడ గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్యవివాహాలను నివారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక విద్యా సదుపాయాలను కల్పిస్తుందని చెప్పారు. అరకు శాసనసభ్యులు చెట్టి పాల్గుణ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. గిరిజన హక్కులు, చట్టాలు పరిరక్షించడానికి ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్‌ను వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ.కొండలరావు, తహాసిల్దార్ వేణుగోపాల్, ఎస్టి కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి, తడబారికి లిల్లీ సురేష్, ఎంపీపీ ఉషారాణి,, జడ్పిటిసి శెట్టి రోషినీ, ఎంపిటిసి దురియా ఆనందరావు, సర్పంచ్ కొర్రా రాధిక, తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్‌ను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

సీలేరు జల విద్యుత్ కేంద్రం (ఫైల్‌ఫోటో)

రికార్డుస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి

- 24 గంటల్లో 10.0128 మిలియన్ యూనిట్ల ప్రొడెక్షన్

- ఎపి జోన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ శ్రీధర్

ప్రజాశక్తి -సీలేరు

ఎపి జోన్‌కో సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని ఇంజనీర్లు, కార్మికులు సమిష్టి కృషితో అత్యధిక విద్యుత్ ఉత్పత్తి చేసి రికార్డు నెలకొల్పినట్లు సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ తెలిపారు. గురువారం ఆయన ప్రజాశక్తితో ప్రత్యేకంగా టెలిఫోన్‌లో మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని పొల్లూరు, డొంకరాయి, సీలేరు, మాచ్ ఖండ్ జల విద్యుత్ కేంద్రాల్లో ఈ నెల 7వ తేదీ జీరో అవర్ నుండి 8వ తేదీ జీరో అవర్స్ వరకు అంటే 24 గంటల్లో 10.0128 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. ఒక రోజు ఉత్పత్తిలో గడిచన పదేళ్లలో ఇది రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి అని పేర్కొన్నారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో ఒక్కొక్క యూనిట్ 115 మెగావాట్ల సామర్థ్యం గల నాలుగు యూనిట్లు ఉన్నాయని, వాటి పనితీరును కాపాడుకుంటూ విద్యుత్ ఉత్పత్తి నిరాటంకంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. దిగువ సీలేరు డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో 25 మెగావాట్లు సామర్థ్యం గల ఒక్క యూనిట్ మాత్రమే ఉందని, సీలేరులో ఒక్కొక్క యూనిట్ 60 మెగావాట్ల సామర్థ్యం నాలుగు యూనిట్లు ఉన్నాయని, అందులో ప్రస్తుతం మూడు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని వెల్లడించారు. ఆంధ్ర ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేయడానికి నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయని, ఆరు యూనిట్లు ద్వారా ఒక రోజుకి 120 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు.

సీలేరు కాంప్లెక్స్ పరిధిలో 24 గంటల్లో చేసిన విద్యుత్ ఉత్పత్తి

జల విద్యుత్ కేంద్రం	ఉత్పత్తి
1.పొల్లూరు జల విద్యుత్ కేంద్రం	5.141 మిలియన్ యూనిట్లు
2. డొంకరాయి జల విద్యుత్ కేంద్రం	0.3798 మిలియన్ యూనిట్లు
3. సీలేరు జల విద్యుత్ కేంద్రం	1.613 మిలియన్ యూనిట్లు
4. మాచ్ ఖండ్ జల విద్యుత్ కేంద్రం	2.879 మిలియన్ యూనిట్లు
నాలుగు కేంద్రాల్లో మొత్తం	10.0128 మిలియన్ యూనిట్లు

మాతాశిశు మరణాల నియంత్రణకు చర్యలు

- ఎపి కుటుంబ నియంత్రణ విభాగం జాయింట్ డైరెక్టర్ జనార్ధన్

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో వద్ద గురువారం ఏపీ కుటుంబ నియంత్రణ విభాగ జాయింట్ డైరెక్టర్ గంపరాయి జనార్ధన్ తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎక్కువ శాతం మాతా శిశు మరణాలు అధికంగా జరుగు తున్నాయని, వీటిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు.జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి ఆయా ప్రాంతాల్లో ప్రజలకు కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించక పోవడంతో గర్భస్రావం ఎక్కువగా జరగడంతో పాటు అనవసర ప్రసవాలు జరగడంతో తల్లులకు అధిక రక్తహీనత ఏర్పడి మాతా శిశు మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఎక్కువ ప్రసవాలు జరగడంతో రక్తహీనత, రోగ నిరోధక శక్తి తగ్గి శిశు మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని ఆయన అన్నారు. బిడ్డలు నెలలు నిండకుండా పుట్టడం తో పాటు తక్కువ బరువుతో పుట్టడంతో శిశు మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. గర్భం దాల్చకుండా కొన్ని పద్ధతులు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మౌనిక, ధరణి, మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెదబయలు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ జనార్ధన్ ఆకస్మిక పర్యవేక్షణ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డ్స్ ,పేసెంట్స్, ఓపి పరిస్థితి పరిశీలించారు. అనంతరం స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ, పిల్లల్ని కనుటకు బిడ్డకు బిడ్డకు మధ్య దూరాన్ని పాటించాలని తెలిపారు. ఈనెల 21 నుండి డిసెంబర్ 4 వరకు వేసేక్టమి కార్యక్రమం లో భాగంగా ఇద్దరి పిల్లలతో సరి పెట్టుకొని కుటుంబ నియంత్రణ చేసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో వైద్యులు సిందూరం పడల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడి జనార్ధన్

నిందితులతో పోలీసులు

24 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని కందమామిడి జంక్షన్ వద్ద గురువారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా స్కూటీ పై ఇద్దరు వ్యక్తులు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వారిని పట్టుకొని వారి వద్ద నుండి రెండు బ్యాగ్ ల్లో ఉన్న 24 కేజీల గంజాయి ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారు ఒరిస్సా సరిహద్దుల్లో ఈ గంజాయిని కొనుగోలు చేసి వి.మాడుగులలో మరొకరికి చేరవేసేందుకు ద్విచక్ర వాహనంపై తీసుకు వెళుండగా పోలీసులు పట్టుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న ఉగ్గం గొయ్యి గ్రామస్తుడు కిల్లో గణేష్, పోతురాజు మెట్ట గ్రామానికి చెందిన వంతల సూరిబాబులను అరెస్టు చేసినట్లు పాడేరు ఎస్సై రంజిత్ తెలిపారు. వీరి నుంచి 24 కేజీల గంజాయితో పాటు ఒక స్కూటీ 3 ఫోన్ మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఈ గంజాయి రవాణా తో సంబంధం ఉన్న అజ్ఞాతంలోని ఇతర ముద్దాయిలను త్వరలో పట్టుకుంటామని ఆయన తెలిపారు.

రాజకీయ పార్టీల నేతలతో సమావేశమైన సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రాజకీయ పార్టీలతో సబ్ కలెక్టర్ సమావేశం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సబ్ కలెక్టర్ శుభం బన్సల్ శుక్రవారం తన ఛాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముందు రోజు వరకు ఓటర్ల జాబితాలో ఏమైనా సమస్యలుంటే సంబంధిత ఫారములు ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కోసం డిసెంబర్ 26వ తేదీ లోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఎన్నికల బూతుల్లో, ఓటర్ కార్డుల్లో తప్పులకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీలను కోరారు. ఇంకా ఎక్కడైనా పోలింగ్ బూతులు ఏర్పాటు అవసరమైతే లికిత పూర్వకంగా దరఖాస్తు చేయాలన్నారు. పోలింగ్ బూతులకు సంబంధించి సెక్టార్ల అధికారులను త్వరలో నియమిస్తామన్నారు. రంపచోడవరం నియోజవర్గానికి సంబంధించిన వివరాలు సిఇఓ ఆంధ్ర వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగిందని తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని చనిపోయిన వారి పేర్లు పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతే ఓటరు జాబితా నుండి తొలగించడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కారం సురేష్. ఎస్.బోజ్జి రెడ్డి, పి.శ్రీనివాసరావు, యం.వాణిశ్రీ, టి.బాబురావు దొర, డిప్యూటీ తహశీల్దారు ఎన్‌వివి.సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్లు డి.ఇందిరాబాయి, టి.లక్ష్మణ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న కుమార్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: వినియోగదారుల హక్కులు కాపాడేందుకు కృషి చేస్తానని జిల్లా వినియోగదారుల సేవా సంఘం కమిటీ సభ్యులు సోనియా ప్రసన్నకుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో వినియోగదారుల సేవా సంఘం ఆధ్వర్యంలో మండల కమిటీ సభ్యులు జిల్లా విజిలెన్స్ కమిటీలో సభ్యులుగా ఎంపికైన ప్రసన్నకుమార్‌ను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,జిల్లాలో ఉన్న 22 మండలాల వినియోగదారుల సేవ సంఘం పెద్దలతో సమన్వయం చేసుకుంటూ హక్కుల కోసం పనిచేస్తామని, వినియోగదారులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల మండల కమిటీ సభ్యులు ఎస్,సూర్య జ్యోతి, కాంతారు మోహన్,సొలగం గాసిరామ్ దొర, బి.పూర్ణ రావు,ఆర్. నాగభూషన్, వర్తకులు ఎల్.రమణ, కె.గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న యువకులు

కాకినాడ రొయ్యల చేపల చెరువులో పని కల్పిస్తామని మోసం

- దళారులపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి -అనంతగిరి: కాకినాడ రొయ్యల చేపల చెరువులో పని కల్పిస్తామని 14 మంది గిరిజన యువకులకు ఈనెల 1వ తేదీన తీసుకువెళ్లి తమపై దాడి చేసి సెల్ ఫోన్లు, డబ్బులు, బ్యాగులు వంటి వస్తువులు దౌర్జన్యంగా లాక్కొని మోసానికి పాల్పడిన దళారులపై చర్యలు తీసుకోవాలని గిరిజన యువకులు కోరారు. సిపిఎం నాయకుల సహకారంతో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు లుంగపర్తి, వేంగడ, గుమ్మ, పెదబిడ్డ పంచాయతీ లకు చెందిన 14 మంది యువకులు పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో గురువారం వారు మాట్లాడుతూ పని కల్పిస్తామని మాయమాటలు చెప్పి నంద్యాల జిల్లా నందికూరు మండలం శ్రీ శైలం అనుకొని నెహ్రూ నగరం లంబాడి దిబ్బ లో ఉన్న రొయ్యలు చేపల చెరువులో పని కల్పిస్తూ నెలకు 12000 రూపాయలు జీతలు ఇవ్వడం కాకుండా భోజన వసతి సదుపాయాలు ఉచితంగా కల్పిస్తామని తమకు చెప్పి 1వ తేదీన మధ్యవర్తి చిన్నతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు తమను తీసుకు వెళ్లారని తెలిపారు.పని కల్పిస్తామన్న ప్రాంతంలో కాకుండా మరో ప్రాంతంలో తరలిస్తుండడంతో గమనించి తాము వారి వద్ద నుండి తప్పించేందుకు ప్రయత్నం చేయగా తమన బంధించి తమపై దాడి చేసి సెల్ ఫోన్లు, బేగులు లాక్కొని అక్కడినుండి పరారై పోయారని తెలిపారు.

మిడ్డేమీల్స్, స్కూల్ శానిటేషన్ కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-రంపచోడవరం

మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కూల్ శానిటేషన్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దీనికి ముందు సీఐటీయూ జిల్లా కార్యాలయం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ సమస్యలు పరిష్కారం చేయాలని, 8 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు ఇవ్వాలని, కార్మికులకు కనీస వేతనంగా రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన సబ్ కలెక్టర్ ప్రతి నెల కార్మికులకు మండల విద్య శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని, 8 నెలల బకాయి వేతనాలు చెల్లించేవిధంగా చర్యలు తీసుకుంటామని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిస్కారం చేస్తామని హామీ ఇచ్చారు.

కేంద్ర రాష్ట్ర కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు : బేబీరాణి

దీనికి ముందు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు జి.బేబీరాణి మాట్లాడారు. ప్రజలకు, దేశానికి వ్యతిరేకమైన వినాసకర కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దూకుడుగా అమలు చేస్తోందని, ఇటువంటి ప్రభుత్వాన్నీ అధికారం నుండి దింపటమే మార్గమని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను లేబర్ కోడ్‌ల రూపంలో బిజెపి కాలరాస్తోందని, పెట్టుబడులు దారుల ప్రయోజనం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచుతామని ప్రకటిస్తున్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేయడానికి భయపడే స్థాయిలో కార్మికులు ఐక్య పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు కె.బాపన్నదొర, యూనియన్ నాయకులు కె.మంగ, ఎమ్.బాపనమ్మ, టి.కుమారి, పద్మ, టి.రామలక్ష్మి, మధ్యాహ్నం భోజనం, స్కూల్ శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌కు సమస్యలను తెలియజేస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

పర్వత ప్రాంతంలో ఎఎస్‌పి సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని లోదొడ్డి పంచాయితీ పరిధిలోని కొండుజాతి గిరిజనులు నివసించే పర్వతప్రాంతమైన కిండంగి గ్రామంలో రంపచోడవరం ఏఎస్పి జగదీష్ ఆడహళ్లి గురువారం సుడిగాలి పర్యటన చేశారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామంలో గిరిజనులతో మమేకమై గిరిజనుల స్థితిగతులను గురించి ఆరా తీశారు. ఆచార వ్యవహారాలు, జీవనశైలి, గ్రామసమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లోదొడ్డి సర్పంచ్ లోతా రామారావు గ్రామ సమస్యలను వివరించారు. ఈ గ్రామంలో 40 కుటుంబాల పైబడి నివసిస్తున్నాయని, గ్రామానికి సరైన రహదారి సదుపాయం లేదని, దీంతో గిరిజనులు నిత్యవసరాలకు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సౌకర్యం లేక రాత్రి సమయంలో గిరిజనుల ఇక్కట్లు వర్ణాతీతమన్నారు. సుమారు 20 మంది చిన్నారులు గ్రామ సమీపంలో ఉన్న లోదొడ్డిలో చదువుతున్నారని, ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు అనేకమంది ఉన్నా అంగన్వాడీ కేంద్రం లేదని, మినీ అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఏఎస్పి జగదీష్ అడహళ్లి చేతుల మీదుగా 40 కుటుంబాల వారికి ఒక్క కుటుంబానికి 5 కేజీలు బియ్యంతో బాటు నిత్యావసర సరుకులు, జత రగ్గులు, మూడు జతలు చెప్పులు, ఆహార పొట్లాలు అందజేశారు. గ్రామంలో యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. యువత చదువు క్రీడలపై ఆసక్తి కనబరచాలని, గ్రామస్తులు చెడు వ్యసనాలకు, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎఎస్‌పి సూచించారు. ఈ కార్యక్రమంలో రాజవొమ్మంగి సీఐ షేక్ బాజీలాల్, జడ్డంగి ఎస్ఐ రఘునాధరావు, ఎస్పి హెచ్‌సి దుర్గారావు, పోలీస్ సిబ్బంది, ఏపీఎస్పీ బెటాలియన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు, నిత్యావసరాలు అందజేస్తున్న ఎఎస్‌పి జగదీష్

సబ్జెక్టు టీచర్ల శిక్షణా తరగతులు డివిజన్ పరిధిలోనే నిర్వహించాలి

- యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పండా కృష్ణయ్య

ప్రజాశక్తి-చింతూరు

సబ్జెక్టు టీచర్ల శిక్షణా తరగతులు డివిజన్ పరిధిలోనే నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా కార్యదర్శి పండా కృష్ణయ్య డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం యుటిఎఫ్ చింతూరు మండల నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని సరిహద్దు ప్రాంతంలో ఉన్న జిల్లా కేంద్రంలో ఉన్న మారుమూల ప్రాంతాల్లో నిర్వహించడం వలన, రవాణా సౌకర్యాలు లేని మండలాల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఒక రోజు ముందు హడావిడిగా ఉత్తర్వులు జారీ చేసి తప్పక శిక్షణకు హాజరు కావాలని, లేకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని భయభ్రాంతులకు గురి అన్యాయమన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం యుటిఎఫ్ మండల నూతన నూతన ఎన్నిక జరిగింది. యుటిఎఫ్ మండల అధ్యక్షులుగా యం.సోమరాజు, ప్రధాన కార్యదర్శిగా బొగ్గ ముత్తయ్య, గౌరవ అధ్యక్షులుగా భీమయ్య, మహిళా అధ్యక్షులుగా కె.తులసి, కోశాధికారిగా కె.బ్రహ్మయ్య ఎన్నికయ్యారు.

నూతనంగా ఎన్నికైన యుటిఎఫ్ మండల కమిటీ

జి-బజార్ ప్రారంభంలో మాట్లాడుతున్న గీతం ప్రో వైస్ చాన్సలర్ గౌతమ్‌రావు

గీతం బిజినెస్ స్కూల్ విద్యార్థుల జి-బజార్

ప్రజాశక్తి-మధురవాడ : ఎమ్‌బిఎ, బిబిఎమ్ తదితర కోర్సులు అభ్యసించే మేనేజ్‌మెంట్ విద్యార్థులలో వాణిజ్య నైపుణ్యాలను పెంచడానికి, చిన్నపాటి వ్యాపారాలలో మెలకువలను అర్థం చేసుకోవడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యాన గురువారం జి-బజార్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా రూపొందించిన గృహ అలంకరణ వస్తువులు, గ్రీటింగ్ కార్డులు, ఫొటోఫ్రేమ్‌లతో పాటు వివిధ ఫుడ్ స్టాళ్లను జి-బజార్‌లో ఏర్పాటుచేశారు. గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు జి-బజార్‌ను ప్రారంభించి మాట్లాడారు. తరగతి గదిలో నేర్చుకున్న విద్యతో పాటు వాస్తవిక ప్రపంచంలో వ్యాపార లావాదేవీలు జరిగే తీరుతెన్నులను లోతుగా అర్థం చేసుకోవడానికి ఈ తరహ జి-బజార్‌లు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థి దశలో స్వయంగా వ్యాపార సూత్రాలను అర్థం చేసుకోవడం వల్ల నాణ్యతా ప్రమాణాలు, మార్కెటింగ్, ధరల నిర్ణయం, కొనుగోలుదారుల ఆసక్తి, అభిరుచి తెలుసుకునే వీలుకలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గీతం వెంచర్ డవలప్‌మెంట్ సెంటర్ చైర్మన్ డాక్టర్ ఐ.బంగారురాజు, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ పీజీకోర్సుల విభాగం డిప్యూటీ డైరక్టర్ ప్రొఫెసర్ పి.మంజశ్రీ సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

గీతం వైద్యునికి అభినందన

డాక్టర్ మల్లేశ్వరరావును అభినందిస్తున్న గీతం అధ్యక్షులు శ్రీభరత్

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) జనరల్ సర్జరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జెఎన్.మల్లేశ్వరరావు ఈ ఏడాది జరిగిన నీట్ సూపర్ స్పెషాలిటి పరీక్షలో జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరిచి 118వ ర్యాంక్‌ను సాధించారు. గీతం వైద్యుని ప్రతిభను గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ గురువారం అభినందించారు. వైద్య వృత్తిలో ఉన్నత ప్రమాణాలను సాధించడంతో పాటు అట్టడుగు వర్గాల వారికి సేవలందించాలని సూచించారు.

ఎయుతో శ్రీలంక వర్సిటీ ఎంఒయు

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో శ్రీలంకకు చెందిన జయవర్ధనపుర విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం చేసుకోనుంది. దీనిపై ఏయూ పాలక మండలిసమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి వర్చువల్ విధానంలో శ్రీలంకలోని జయవర్ధనపుర విశ్వవిద్యాలయం ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఏయూలో పాలి, బుద్ధియన్ స్టడీస్ కోర్సుల నిర్వహణకు సంబంధించిన సిలబస్ తయారీ, బోధన సిబ్బంది, పరీక్షల నిర్వహణ, మూల్యాంకన విధానం తదితర అంశాలను చర్చించారు. సిలబస్ సమగ్రంగా చర్చించి ఖరారు చేయాలన్నారు. అనంతరం డిసెంబర్ 9వ తేదీన ఏయూలో ఎంఒయు చేసుకునే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. జయవర్ధనే విశ్వవిద్యాలయం వీసీ, ఇతర అధికారులు, ఆచార్యులను ఏయూ పూర్వవిద్యార్థుల వార్షిక సమావేశానికి ఆహ్వానించారు. అదే రోజున వేదికపై ఎంఓయూ చేసుకోవాలని ప్రతిపాదించారు.

క్రీడల్లో రాణిస్తే దేశానికి కీర్తి ప్రతిష్టలు

-జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర

-రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి- అరకు లోయ : నియోజకవర్గ కేంద్రమైన అరకులోయ మండల కేంద్రంలో 67వ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ గురువారం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఏపీ ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ 14 వాలీబాల్ టోర్నమెంట్ ను విశాఖ ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రారంభించారు .ఈ సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ సుభద్ర మాట్లాడుతూ, గిరిజన విద్యార్థిని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని ఆమె అన్నారు. క్రీడల్లో రాణించడంతో శరీర దారుర్యం మానసిక ఉల్లాసం కలగడమే కాకుండా దేశానికి రాష్ట్రానికి జిల్లాలకు కూడా మంచి పేరు ప్రతిష్టలు వస్తాయని ఆమె స్పష్టం చేశారు.రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ఏజెన్సీ ప్రాంతమైన అరకులలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడల్లో ఓటమి గెలుపు సహజమని ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించు కోవాలని, స్నేహపూర్వక వాతావరణం మధ్య ఆటలు ఆడాలని ఆమె అన్నారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ, ఇంతవరకు దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన వారిలో ఎక్కువ మంది గిరిజన క్రీడాకారులు ఉన్నారని ఆయన అన్నారు. వాలీబాల్ టోర్నమెంట్ సందర్భంగా వివిధ సంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఈనెల 9 నుంచి 11 వరకు జరిగే ఈ టోర్నమెంట్లో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 13 బాలికలు, 13 బాలురు మొత్తం 26 టీంలు సుమారు 320 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అరకులోయ ఎంపీపీ ఉషారాణి, జడ్పిటిసి రోషిని అశోక్,ఎంపిటిసి దురియా ఆనంద్ కుమార్, పాడేరు గిరిజన సంక్షేమ శాఖ డిడి కొండలరావు,డిప్యూటీ డిఈఓ చెల్లయ్య, ఇన్చార్జ్ డిఇఓ అప్పారావు నాయుడు, ఏ టి డబ్ల్యూ ఓ మల్లికార్జునరావు, ఎంఈఓ లు వి.త్రినాథ్ రావు, భారతిరత్నం, ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ 14 నిర్వాహకులు సూరిబాబు,ఫిజికల్ డైరెక్టర్లు అప్పలరాజు , వివిధ ప్రాంత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు .

రక్తదానంతో ప్రాణాలు కాపాడండి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: రక్తదానంతో ప్రమాదంలో ఉన్న రోగుల ప్రాణాలు కాపాడాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఎఎస్ఆర్ బ్రాంచి సౌజన్యంతో ఏపి రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలక్టర్ ప్రోత్సాహంతో గురువారం కలక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్యవంతులందరూ రక్త దానం చేయాలని, దీంతో, ఎటువంటి అనారోగ్యం సంభవించదని, ఆరోగ్యవంతులు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని వివరించారు. ఈ రక్త దాన శిబిరంలో పాడేరు డివిజనులోని ఎనిమిది మండలాల రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిబిరంలో సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ నుంచి 20 మంది జవాన్లు, పాడేరు డిగ్రీ కళాశాల నుండి 15 మంది విద్యార్థులు రక్తదానంలో పాల్గొన్నారు. కలక్టర్ చేతులు మీదుగా సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ శిబిరంలో 70 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎంపిడిఓ నవీన్, ఎపి రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.చిన్నికృష్ణ, సెక్రటరీ వి.త్రినాథ్‌రావు నాయుడు, ఉపాధ్యక్షుడు కె.అప్పలస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఒ.ప్రశాంత్ కుమార్, ట్రెజరర్ వి.చంద్రశేఖర్, రెడ్ క్రాస్ సభ్యులు జి.రూప కళ, కె.సింహాచలం, వి.లోహితాస్, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్లు జారీకి చర్యలు

ప్రజాశక్తి-పాడేరు: ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంపై కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, పిఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో గ్యాస్ కనెక్షన్ లేని వారికి ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్ జారీ చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలని కనీసం జిల్లాలో పదివేల గ్యాస్ కనెక్షన్స్ మంజూరు చేయుటకు గాను యాక్షన్ ప్లాన్ చేసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతి సచివాలయము లో కనీసం 100 గ్యాస్ కనెక్షన్లు జారీ చేయుటకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినారు. ఉజ్వల పథకం కింద జారీ చేయబడు గ్యాస్ కనెక్షన్లు పూర్తి ఉచితము అని ప్రచారం చేయాలన్నారు. సచివాలయం, వెలుగు సిబ్బంది గ్రామాలలో అర్హులైన కుటుంబాల నుండి సంబంధిత డాక్యుమెంట్లు పత్రాలు సేకరించాలన్నారు.

నేరాలు ఘోరాలు

21 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-కొత్తకోట: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి సుమారు 21 కేజీల గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ మహ్మద్ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన కధనం మేరకు... బుధవారం సాయంత్రం కొత్తకోట బస్ స్టాండ్ వద్ద తమిళనాడు రాష్ట్రం కాంచిపురం జిల్లా చేయ్యూరు మండలం సున్నంపట్టి గ్రామానికి చెందిన వినోత్ దాస్, అల్లూరు జిల్లా దుబ్రీగూడ మండలం సువ్వా గ్రామానికి చెందిన కిరణ్ రాజ్ అనుమానస్పదంగా సంచరిస్తున్నారు. ఈ ఇద్దరు రెండు సంచులలో గంజాయిని తరలించేందుకు సిద్ధంగా ఉండగా ముందస్తు సమాచారం మేరకు కొత్తకోట ఎస్ఐ కె.లక్ష్మణరావు సిబ్బందితో దాడి చేసి పట్టు కున్నారన్నారు. వీరి నుంచి 21 కేజీల గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నట్టు సిఐ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం చోడవరం కోర్టు కు తరలించామని సిఐ వివరించారు.

8 లీటర్ల నాటుసారా పట్టివేత

ప్రజాశక్తి - మాడుగుల: నాటు సారా తయారీపై దాడి చేసి 8 లీటర్ల నాటు సారాతో ఇద్దరిని అరెస్టు చేసినట్లు మాడుగుల స్పెషల్ ఇన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ ఎస్.సింహాద్రి తెలిపారు. మండల శివారు ఎల్.గదభవీధి లో నాటు సారా తయారీ చేస్తున్న స్థావరంపై దాడి చేసి, వంతల దేవుడు, వంతల నాగరాజులను అరెస్టు చేసి వారి నుండి 8 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సింహాద్రి తెలిపారు.

వర్క్‌షాపులో పాల్గొన్న నిపుణులు

పరిశోధన పత్రాల ప్రచురణ ద్వారా గుర్తింపు

ప్రజాశక్తి-మధురవాడ : విశ్వవిద్యాలయాలలో పనిచేసే అధ్యాపకులు బోధనతో పాటు పరిశోధనలు జరపడం వాటిని ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురణ అయ్యే విధంగా కృషి చేసినప్పుడే అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని, దీనికి తగినంత ముందస్తు శిక్షణ, అవగాహన అవసరమని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం బెంతెమ్ సైన్స్ ప్రచురణ సంస్థ నిర్వహించిన వర్క్‌షాప్‌లో నిపుణులు పేర్కొన్నారు. గీతం నాలెడ్జి రిసోర్స్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బెంతెమ్ సైన్స్ ప్రచురణ సంస్థ అకడమిక్ రిలేషన్స్ డైరక్టర్ డాక్టర్ గరేత్ డైక్ మాట్లాడుతూ, తాము 160కి పైగా ముద్రణ, ఆన్‌లైన్ జర్నల్స్‌ను ప్రచురిస్తున్నామని, వీటికి దాదాపు 30 శాతం శాస్త్ర విజ్ఞాన పరిశోధన పత్రాలు భారతీయ విశ్వవిద్యాలయాల నుంచి అందుతున్నాయని వెల్లడించారు. జర్నల్స్‌లో తమ పరిశోధన వివరాలను ప్రచురణకు పంపేవారు జర్నల్స్‌లో వినియోగిస్తున్న భాష, ఇతరులు ఏవిధమైన శాస్త్ర సమాచారాన్ని తేలికగా అర్థం అయ్యే విధంగా ప్రచురణకు పంపుతున్నారో లోతుగా అర్థం చేసుకోవాలని సూచించారు. కాపీ పరిశోధన పత్రాలను పంపేవారిని సంపాదక వర్గం తీవ్రంగా పరిగణిస్తుందని, ప్లాగరిజం గుర్తించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ప్రచురణ కోసం పరిశోధనా పత్రాలు పంపే వారు ఆంగ్లభాష విషయంలో జాగ్రత్త తీసుకోవాలని, ముఖ్యంగా పదగంభీరం కోసం క్లిష్టమైన పదాలను వాడకుండా అందరికి సులువుగా అర్థమయ్యే శాస్త్ర విజ్ఞాన భాషను ఉపయోగించాలన్నారు. పరిశోధనా ఫలితాలను వెల్లడించే క్రమంలో సరికొత్త పంథాలో ఏవిధంగా పరిష్కార మార్గాలు సూచిస్తున్నామో వివరించాలని చెప్పారు. జర్నల్స్‌లో పరిశోధన పత్రాలు ప్రచురించకుండా తిరస్కరణకు గురైతే చింతించకుండా సంపాదక వర్గానికి కారణాలు తెలపమని కోరవచ్చని, తద్వారా మెరుగైన పద్ధతిలో పరిశోధన పత్రాలను రచించడం సాధ్యపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బెంతెమ్‌సైన్స్ గ్లోబల్ లైసెన్సింగ్ అధిపతి డాక్టర్ లెటిన్ స్టార్క్, భారతీయ విభాగం ప్రతినిధి కమల్‌బాబు, గీతం గ్రంథాలయాధికారి డాక్టర్ సిబప్రసాద్ పాండా, వివిధ విభాగాల పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సేవలు పొందుతున్న ప్రజలు

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-సీలేరు : ఆధార్ సేవలను ప్రతి ఒక్కరనూ సద్వినియోగం చేసుకోవాలని సీలేరు సర్పంచ్ దుర్జో పేర్కొన్నారు. జీకే వీధి మండలం సీలేరు సచివాలయంలో ఆధార్ సెంటర్‌ను గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ప్రజలకు గురువారం ఉదయం నుంచి సేవలు అందుబాటులో తీసుకొచ్చామన్నారు. జీరో నుండి ఐదు సంవత్సరాలు లోపు వయస్సు కలిగిన వారికి కొత్త కార్డులు నమోదు, జిల్లా మార్పిడి ఆధార్ అప్‌డేట్, పాన్ కార్డు అప్‌డేట్ సర్వీసులు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సేవలు సీలేరులో ఐదు రోజులు పాటు అందుబాటులో ఉంటాయని చెప్పారు. గురువారం కొత్త ఆధార్ కార్డు నమోదు, పాన్ కార్డులు అప్డేట్లు, అడ్రస్ మార్పు 50 మందికి చేశారు. ఈ కార్యక్రమంలో వాలంటరీ ఈశ్వర్ పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలి

ప్రజాశక్తి - రంపచోడవరం : గర్భిణులు వైద్యుల సలహాలు పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని రంపచోడవరం ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్, గైనకాలజిస్టు డాక్టర్ కె.లక్ష్మి అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పిఎంఎస్ఎంఎ) రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు గురువారం రంపచోడవరం ఏరియా హాస్పిటల్‌లో 62 మంది గర్భిణులకు వారు పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణులకు స్కానింగ్, బ్లడ్ టెస్ట్‌లు చేసి మందులు అందజేశారు. ప్రత్యేకంగా కౌన్సిలర్ వాసుతో పర్సనల్ హైసేన్, న్యూట్రిషన్ గురించి కౌన్సిలింగ్ ఇప్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ ప్రతినెలా జరుగుతున్న పిఎంఎస్ఎంఎ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

నిత్యపాసరికి అభినందనల వెల్లువ

విశాఖపట్నం : నగరానికి చెందిన మూడన్నరేళ్ల చిన్నారి నిత్యపాసరికి అతి చిన్న వయసుగల చెస్ క్రీడాకారిణిగా వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కడంపై విశాఖ జిల్లా చెస్ సంఘం ప్రతినిధులు మణికంత, శ్రీకాంత్, బాబూరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోచ్ రవితేజ కనకల వద్ద శిక్షణ పొందుతున్న నిత్యపాసరి ఇటీవల నగరంలో జరిగిన జిల్లాస్థాయి చెస్ టోర్నీల్లో పాల్గొని బోర్డుపై ఎత్తుకు పై ఎత్తులతో ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో జిల్లా చెస్ సంఘం ప్రతినిధులు బుక్‌ఆఫ్ రికార్డు ప్రతినిధులకు వివరాలు అందజేశారు. దీంతో ఢిల్లీ నుంచి ప్రతినిధులు నగరానికి చేరుకుని వారు నిత్యపాసరి ఆటతీరును ప్రత్యక్షంగా వీక్షించడంతో పాటు వయస్సు వివరాలపై ఆధారాలను సేకరించారు. కొద్దిరోజుల తర్వాత వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డులలో నిత్యపాసరి పేరును చేర్చి పతకం, ధ్రువపత్రం అందజేశారు. నిత్యపాసరి తల్లిదండ్రులు నిధి, మనోహ్మన్‌లను జిల్లా చెస్ సంఘం ప్రతినిధులు అభినందించారు.

జివిఎంసి అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో జివిఎంసి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఇతర దేశాల నగరాలకు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని అమెరికాలోని కార్మెల్ సిటీ మేయర్ జేమ్స్ బ్రైనార్డ్ పేర్కొన్నారు. గురువారం ఆయన విశాఖ నగరంలోగల జివిఎంసి అభివృద్ధి ప్రాజెక్టులను జివిఎంసి అదనపు కమిషనర్లు ఎస్ఎస్.వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావులతో కలిసి సందర్శించారు. ఈ సందర్శనా పర్యటనలో ముందుగా ముడసర్లోవలోగల ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్రాజెక్ట్, కాపులుప్పాడలోగల వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను, ఎండాడ వద్దగల ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను, ఒన్ టౌన్‌లోగల రాస్ హిల్ చర్చిని సందర్శించారు. అనంతరం ఆంధ్రా యూనివర్సిటీలోగల అమెరికన్ కార్నర్‌లో పర్యటించారు.

ప్రజా రక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఎటపాక

అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 15న విజయవాడలో జరుగుతున్న ప్రజా రక్షణ భేరి బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని తోటపల్లిలో జి.హరనాథ్ అధ్యక్షతన గురువారం జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ప్రజారక్షణ భేరి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మర్లపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రానికి బీజేపీ చేస్తున్న అన్యాయాలను వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు ప్రశ్నించకపోవడం, బీజేపీ విధానాలకు కొమ్ము కాయడం దారుణమన్నారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని సిపిఎం ప్రజా క్షేత్రంలో పోరాడుతుందని, చట్ట సభల్లోనూ పోరాడాలంటే సిపిఎంను బలపరచాలని, అప్పుడే నిర్వాసితులకు పూర్తి న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఐవి, నాయకులు కాకా అర్జున్, ఐ.పద్మ, పులుసు బాలకృష్ణ, గద్దల హుస్సేన్, అపకా సమ్మక్క, సూరమ్మ, కమల, మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీరు కరువు

కనిష్ట స్థాయికి నీటి నిల్వలు
వట్టిపోతున్న జలాశయాలు
ఎండిపోతున్న పంటలు
కొనసాగుతున్న వర్షాభావం
చలించని ఎమ్మెల్యేలు

తాండవ జలాశయంలో తగ్గిన నీటిమట్టం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో జలాశయాల కింద సాగుచేస్తున్న రైతుకు కూడా పంట నష్టం ముప్పు తప్పేలాలేదు. వర్షాభావ పరిస్థితులు కొనసాగడంతో జలాశయాల నీటి నిల్వలు చివరి దశకు వస్తున్నాయి. మరో పది రోజులు వర్షాల్లేకపోతే వరి పంటకు నీరివ్వలేని కనిష్ట స్థాయికి జలాశయాలు చేరుకోనున్నాయి. కరువు పరిస్థితులు తీవ్రంగావున్నా ప్రభుత్వం కరువు గుర్తించ నిరాకరించింది. పొట్ట దశలో వరి పంటకు నీరు ఇవ్వలేకపోవడంతో పంట దిగుబడులు భారీగా తగ్గనున్నాయి. చేతికొచ్చిన పంట కూడా నాణ్యత వుండదని రైతులు చెబుతున్నారు.

జిల్లాలో గురువారం నాటికి సగటు వర్షపాతం లోటు 31.4 శాతానికి పెరిగింది. వర్షపాతం లోటు 25 నుంచి 50 శాతం మధ్యవుంటే కరువు ఛాయలు వున్నట్లు ప్రభుత్వం గుర్తించాల్సివుంది. జిల్లాలోని 24 మండలాల్లో 25 నుంచి 50 శాతం మధ్య వర్షపాతం లోటు మండలాలు 12 వున్నాయి. రోలుగుంట, రావికమతం, మాడుగుల, కె.కోటపాడు, సబ్బవరం, పరవాడ, అనకాపల్లి, కోటవురట్ల, మాకవరపాలెం, మునగపాక, యలమంచిలి, ఎస్.రాయవరం మండలాల్లో 25 శాతానికి పైబడి 50 శాతం వరకు వర్షపాతం లోటువుంది. వర్షపాతం లోటు 50 శాతానికి మించి వుంటే తీవ్రమైన కరువుగా పరిగణించాల్సివుంది. అచ్యుతాపురం, నక్కపల్లి, పాయకరావుపేట, రాంబిల్లి మండలాల్లో 50 శాతానికి మించి వర్షపాతం లోటు వుంది. ఈ మండలాల్లో వరి పొలాలు ఎండిపోతున్నాయి.

జిల్లాలో 1500 ఎకరాల్లో వరి పంట ఎండినట్లు, మరో 3,500 ఎకరాల్లో పంట వాడిపోయినట్లు వ్యవసాయశాఖ గుర్తించింది. వాస్తవానికి ఇంతకు నాలుగింతల పంట ఎండిపోయిన పరిస్థితులున్నాయి. జిల్లాలో వరి సాగుకావాల్సిన 1,36,460 ఎకరాలకు 1,10,765 ఎకరాల్లో (81 శాతం) రైతులు పంట వేశారు. దీంట్లో తాండవ, రైవాడ, కోనాం, పెద్దేరు జలాశయాల కింద 75,414 ఎకరాల ఆయకట్టుకుగానూ 60,269 ఎకరాల్లో పంట నమోదైంది. ఖరీఫ్ ఆరంభం నుంచి జలాశయాల్లో సరిపడా నీరులేక శివారు ఆయకట్టుకు నీరు అందించలేకపోవడంతో వరి సాగుచేయలేని పరిస్థితి ఏర్పడింది. జలాశయాల్లో వున్న కొద్దిపాటి నీరు కనిష్ట స్థాయికి సమీపిస్తుండడంతో సాగైన వరి పంటకు పూర్తిగా నీరు అందడంలేదు. దీంతో జలాశయాల ఆయకట్టులో అత్యధిక భాగం పంట ఎండిపోతోంది. వర్షాలు పడి జలాశయాల్లోకి పై నుంచి నీరు రాకపోతే జలాశయాల ప్రధాన కాలువల కింద పంటకు నీరు అందివ్వలేని పరిస్థితి రానుంది. వాస్తవానికి గరిష్టంగా నెల రోజులు, కనీసంగా 20 రోజులు వరి పంటకు నీరు అందించాల్సివుంది. ప్రస్తుతం జలాశయాల్లోవున్న నీరు మరో పది రోజులకు మించి సరిపోయేలా లేదు. ప్రస్తుతం విడిచిపెడుతున్న నీరు కూడా సరిగా కాలువల్లో ప్రవహించడంలేదు. దీనివల్ల ఎత్తైన మదుముల నుంచి పిల్ల కాలువల్లోకి నీరు పారడంలేదు.

తాండవ జలాశయ పూర్తిస్థాయి నీటి మట్టం సామర్థ్యం 380 అడుగులకుగానూ ప్రస్తుతం 351 అడుగులకు నీరు వుంది. రైవాడలో 373.77 అడుగులకు 352.79 అడుగులు, కోనాంలో 331.96 అడుగులకు 300.98 అడుగులు, పెద్దేరులో 449.18 అడుగులకు 433.93 అడుగుల నీరు వుంది. జలాశయాల నుంచి విడుదల చేసిన నీరు ప్రధాన కాలువల్లోకి ప్రవాహ వేగంతో వెళ్లకపోవడంతో శివారు ఆయకట్టుకు, ఎత్తైన పంట పొలాలకు నీరు వెళ్లడంలేదు. కొంతదూరం వెళ్లాక నీరు స్తంభించిపోతోంది.

అభివృద్ధి పనుల ప్రారంభంలో ప్రజాప్రతినిధులు

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని మర్రివాడ గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి ఎంపిపి బడుగు రమేష్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మాణం, అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాదల సత్యవతి, నాయకులు మాదల చిన్నారావు, పొత్తూరు తాతరావు, జల్లి ఆనంద్, నత్తూరు సొమన్న దొర, జర్తా శివ, పొత్తూరు రాజుబాబు, కించే సతీష్, అర్జున్‌రావు, సచివాలయ కార్యదర్శి విజయ్, అశోక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

రావిమనుపాలెంలో...

కొయ్యూరు మండలం, వెలగలపాలెం పంచాయతీ పరిధి రావిమనుపాలెం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆ గ్రామ సర్పంచ్ ఇరవాడ రత్నకుమారితో కలిసి ఎఎస్ఆర్ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి ఆధ్వర్యంలో ప్రాధాన్యత బట్టి సిసి రోడ్లు, సీసీ డ్రైనేజీ, మంచినీటి బోర్లు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుర్ల గంగా, పవన్, సత్తిబాబు, వెంకటరమణ, పంతులు పాల్గొన్నారు.

రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి

ప్రజాశక్తి - సీలేరు : వర్షాభావంతో పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని జనసేన జీకే వీధి మండలం నాయకులు కొయ్యం బాలు, సిద్దు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. జీకే వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ నేలజర్త గ్రామాన్ని గురువారం వారు సందర్శించి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ జీకే వీధి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి పంటల పండక నష్టపోయిన గిరి రైతులకు ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వనపల ఈశ్వర్, కూడా మధు, కిలో రాజన్, ఉల్లి సీతారాం, వంతల రాజారావు, శెట్టి స్వామి, టి.రమేష్, కే.భాను ప్రసాద్, గిరిజన రైతులు మార్కు రాజు, నేలజర్త రైతులు పాల్గొన్నారు.

మళ్లీ మొరాయించిన యుబిఐ ఎటిఎం

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ) ఎటిఎంకు మరమ్మతులు నిర్వహించి 24 గంటలు గడవకముందే మళ్లీ మొరాయించింది. దీంతో ఖాతాదారులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. ఎటిఎం 15 రోజుల నుండి పని చేయడం లేదు. యుబిఐ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఏటీఎం సర్వీస్ ఇంజనీరు శ్రీనివాస్ మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. గురువారం ఉదయం 10 గంటల వరకు ఏటీఎం నుంచి ఖాతాదారులు డబ్బులు విత్ డ్రా చేశారు. అనంతరం డబ్బులు విత్‌డ్రా కాకపోవడంతో ఖాతాదారులు బ్యాంకు సిబ్బందికి సమాచారం అందించారు. ఏటీఎం సర్వీస్ ఇంజనీరు శ్రీనివాస్ 24 గంటలు ఏటీఎం పనితీరు పరిశీలించి అనంతరం వెళ్లి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని ఖాతాదారులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీనిపై బ్యాంకు మేనేజర్ చిన్నారావును ప్రజాశక్తి వివరణ కోరేందుకు ప్రయత్నించగా మేనేజర్ రుణాలు రికవరికి బయటకు వెళ్లారని యుబిఐ సిబ్బంది తెలిపారు.

నేటి ప్రత్యేక స్పందనకు హాజరు కావాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10న శుక్రవారం జరుగు 'జగనన్నకు చెబుదాం' ప్రత్యేక స్పందన కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో లాలం సీతయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం హాజరు కాని వారిపై తగు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.